
## అది 1953 మే 5 అనుకొంటా. ఆ రోజు నాకు ఎవరెస్టు శిఖర మెక్కినంత సంతోషమైంది.

పెళ్లైన కొత్త. నేను అత్తవారింటికి వెళ్లాను. వేయి పడగలు చదువుతున్నాను. పాడుతున్న రేడియో కాస్తా మూగబోయింది. మా బావమరిది తెల్లమొగంతో వచ్చి న్యూస్ బ్రేక్ చేశాడు. "బావా! రేడియో పాడైపోయింది" అని. అది తెలుస్తూనే వుంది. అది ఎట్లా పాడైంది?' అడిగాను. "నేను వద్దంటున్నా వినకుండా అక్క స్టేషన్లు వరుసగా మార్చి ఇంకా తిప్పేసింది. అంతే, 'లోపల ఏమైందోగాని టుప్పుమని చప్పుడైంది"

# మొలతాడు



-చిట్టూరి దామోదర శాస్త్రి

అన్నాడు శ్యాలకుడు.

నేను రేడియో మెకానిజం తెలిసిన ఎక్స్‌పర్టు పోజు పెట్టి "ఏం భయంలేదు వెంటనే తీసుకురా! స్క్రూ డ్రైవరుందా ఇంట్లో?" అని అడిగాను. వాడు చాలా భయస్థుడు. "ఇంకా పాడవుతుందేమో బావా?" సందేహించాడు. "ఫర్వా లేదు నన్ను చూడని" అని ధైర్యం చెప్పాను. కాని వాడు తేలేదు.

పొద్దున్నంగా పొలం వెళ్లిన మామగారు మండు టెండలో వచ్చారు. తరువాత స్నానాలు భోజనాలు అయినాయి. "రెండవుతున్నట్లుంది, రేడియో ఆపేశారేంరా?" అడిగారు మామగారు. ఎవళ్లూ మాట్లాడ లేదు. ఎవళ్లకేం మూడుతుందోనని అందర గప్‌చిప్‌గా వున్నారు.

నేనూరు కోవచ్చా? "తెలుగు వార్తలు విందామను కున్నాను. స్టేషను మార్చబోతే... లోపల టుప్పు మంది" అన్నాను. ఆయన ప్రళయరుద్రుడౌతా డను కొన్నాను. నవ్వుతూ "ఫర్వాలేదు, బందరెళ్లి బాగు చేయిద్దాంలెండి" అన్నారు. అందరూ మనసులో 'హమ్మయ్య!' అనుకొన్నారు.

సాయంకాలం చల్లబాటువేళ మామగారు మళ్లీ పొలం వెళ్లారు. 'వేయి పడగలు' చదవ బుద్ధి పుట్ట లేదు. రేడియో పలకడం లేదు. దొంగ చూపుల్తో దూరంగా కనిపించే కొత్త పెళ్లి కూతురు పాడైన రేడియో గొంతులా మాయమైంది. అప్పుడు నిశ్చయించు కున్నాను. రేడియో పలకాలి, తలపుల తారల వెన్నెల రాణి దర్శనమియ్యాలి.

రేడియో చేత బుచ్చుకున్నాను. అప్పటికింకా ఆ ఊరికి కరెంటు రాలేదు. ఆ రేడియో బాటరీతో పని చేస్తోంది. కాబట్టి రేడియోకు రెట్టింపు బరువున్న బాటరీ కూడా తీసుకున్నా. గదిలో చేరి తలుపులు వేసుకున్నా. స్క్రూ డ్రైవరు వంటి కనీస సాధన సంపత్తి కూడా లేదు. జంధ్యానికో చిన్న తాళం చెవి, ఓ సాటి పెరిగిన గోళ్లు, పాత బ్లేడు-ఇవీ సాధనాలు. రేడియో ఊడదీశా. టుప్పుమన్న భాగం ఏదో పరిశీలించా. అది స్టేషన్ల మార్చడి కుపయోగించే డయల్ త్రెడ్. దానికి సరిపడిన తీగో తాడో కన్పించలేదు. తలుపు తీస్తే పిల్ల మూక లోపల జొరబడతారు. అప్పటికే వాళ్లు కిటికీ లోంచి రేడియో విప్పిన వైనం చూశారు. తలుపులు తెరిచి వాళ్ల నాపలేం.

ఏం చెయ్యాలో తోచలేదు. మృచ్ఛకటిక నాటకంలో ఓ బ్రాహ్మణుడు దొంగగామారి జందెం ఆ చతుష్షష్టి కళల్లో ఒకటైన దొంగతనానికెట్లా ఉపయోగిస్తుందో ఉపన్యసిస్తాడు. నేను చేసేది దొంగతనం కాక పోయినా రహస్యంగా చేస్తున్న నాయీ మరమ్మతు కార్యక్రమా నికి, ఏది తోడు పడుతుందో అని ఆలోచిస్తుండగా ఓ పిల్లవాడు చేత వెన్న ముద్ద చెంగల్వ పూదండ, బంగారు మొలతాడు పట్టుదట్టి, సందిట తాయెత్తు సరిమువ్వ గజ్జెలు, చిన్న కృష్ణ నిన్ను చేరికొల్తు' అని పాడుతున్నాడు. హారెవా, బంగారు మొలతాడు!' అనుకుంటూండగా బ్లేడుతో నా మొలతాడు టుప్పుమంది. అదే డయల్ త్రెడ్‌గా మారింది.

అప్పటికి విజయవాడ స్టేషన్ పలికే స్తోంది. ట్యూన్ చేశానో లేదో 'నేటి సాయంకాలం మా ప్రసార విశేషాలంటున్నాడు ప్రియతమ ఎనౌన్సరుడు."రేడియో బాగైంది, రేడియో బాగైంది"అంటూ ఎగిరి గంతేశాడు మా బావమరిది.

అప్పుడు దర్శన మిచ్చింది మా ఆవిడ ప్రశంసా పూర్వకంగా నావంక చూస్తూ. అప్పుడు నాకు ఎవరెస్టు శిఖరమెక్కినంత సంతోషమైంది. ఆ రోజు రాత్రి - హిల్లరీ, టెన్సింగ్ నార్కే ఎవరెస్టెక్కినట్టు నేను బాగు చేసిన రేడియో గొంతెత్తి పలికింది. ●

## కాలమ్ దాటని కథ

ఒకసారి ఒక ఆఫీసరు తమ పుత్రరత్నం కాలేజీలో ఎలా వుంటున్నాడో, ఎంత శ్రద్ధగా చదువుకుంటు న్నాడో తెలుసుకోగోరి కొడుకు చదువుకుంటున్న కాలేజీకి వెళ్ళాడు. ఆ సమయంలో క్లాసులో ఇంగ్లీషు లెక్చరర్ పాఠం చెపుతున్నారు. ఆ ఆఫీసరు లెక్చరర్‌గారిని పరి చయం చేసుకుని తన కుమారుడి గురించి అడగడం ప్రారంభించాడు. ఆ ఆఫీసరు పుత్రుడు తండ్రి రావడం గమనించి కామ్ అయిపోయి పాఠం శ్రద్ధగా వింటున్నట్టు నటిస్తూ టెక్స్ట్ బుక్ పక్కగా పట్టుకొని బుర్ర వంచుకుని కూర్చున్నాడు.

పాత కేడీలా వున్న ఆ విద్యార్థిని గమనించి లెక్చరర్ అతడి తండ్రికీ, అతడికి వినపడేలా "మీ వాడికే మంచీ రాజా!" అని కాసేపు ఆగి, "కామ్ గోయింగ్..." అని తండ్రి, కొడుకులను మార్చి మార్చి చూశాడు. ఆ మాట చెవినపడగానే కాస్త ఊపిరి పీల్చుకున్నాడు పుత్ర

### "కామ్ గోయింగ్ అండ్..."



రత్నం. తండ్రి ముఖంలో గర్వం తొణికిసలాడింది 'వాడు నా కొడుకు' అన్నట్టుగా. "అండ్ అవుట్ స్టాండింగ్" అంటూ ముగించి తన స్థానం చేరాడు లెక్చరర్.

గవర్నమెంటు ఆఫీసరు కావడంతో అతడి బుద్ధి కూడా మెల్లిగా వికసించి తన కారెక్కాక కంగుతిన్నాడు.

"కామ్ గోయింగ్ అండ్ అవుట్ స్టాండింగ్" అంటే "క్లాసులోంచి మెల్లగా జారుకొని చెట్ల కింద నిలబడే రకం" అని అర్థమయ్యేసరికి "ఈ గాడిద నా కొడుకా" అని జి.ఓ.ఎమ్.ఎస్.... ఏదో నెంబరు కింద డొటొచ్చింది.

— ధరణీ ప్రగడ